ఊరూరా సంక్షేమ పండుగ

- ఉత్సాహంగా నూతన, పాత పింఛన్ల పంపిణీ


ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో పింఛన్ అందజేస్తున్న వివేకానంద, ప్రేమ్‌కుమార్


వజ్రపుకొత్తూరు రూరల్: పెదబాడాంలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ మోహన్‌రావు, నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఊరూరా సంక్షేమ పండుగ సందడి శుక్రవారం తెల్లవారు జామునుంచే కనిపించింది. కొత్తగా మంజూరైన పింఛన్లతోపాటు పాత సామాజిక పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా జరిగింది. కొత్తగా మంజూరైన పింఛన్లను ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందజేశారు. గడప గడపకు సంక్షేమ పాలన చేరువ చేస్తూ అర్హత కలిగిన ప్రతిఒక్క లబ్ధిదారుడికి మేలు చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అందిన దరఖాస్తులతో పాటు గతంలో పలు కారణాలతో నిలిచిన పింఛన్‌లు అత్యధికంగా మంజూరు కావడంతో గ్రామాల్లో పండగ వాతావరణం సంతరించుకుంది. వజ్రపుకొత్తూరు, సీతాపురం, నగరంపల్లి, రాజాం, పెదబాడాం, గుణుపల్లి, మోట్టూరు తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు మోహన్‌రావు, జె.అప్పారావు, డి.పాపారావు, గ్రామ వలటీర్లు, గృహసారథులు ఉన్నారు.

458 కొత్త పింఛన్లు మంజూరు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలానికి సంబంధించి సెప్టెంబర్ నెలలో 458 నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు తెలిపారు. ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలో తొలిరోజున 70 శాతం వైఎస్సార్ భరోసా పింఛన్లు పంపిణీ పూర్తయినట్టు చెప్పారు. కాగా ఈదుపురం గ్రామ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. సర్పంచ్ నర్తు వరప్రసాదరావు యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి నీలాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పలాస: బొడ్డపాడులో పింఛన్ల దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

సామాజిక పింఛన్ల వివరాలు పరిశీలన

పలాస: మండలంలోని వివిధ పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లకు సంబంధించిన దరఖాస్తుల వివరాలను ఎంపీడీవో రమేష్ నాయుడు తదితరులు పరిశీలించారు. గురుదాసుపురం, నీలావతి, మాకన్నపల్లి, బొడ్డపాడు తదితర గ్రామ పంచాయతీల్లోని లబ్ధిదారులను పిలిపించి వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. మండలంలో 170 మందికి చెందిన దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలన చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కొత్తగా మంజూరైన పింఛన్ల మంజూరుకు మరో వారం పడుతోందని ఎంపీడీవో చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు వస్తాయని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. బొడ్డపాడు ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, సర్పంచ్ తామాడ మదన్, పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంటు పార్వతి పాల్గొన్నారు.

శాసనాం పంచాయతీకు 14 పింఛన్లు..

టెక్కలి: శాసనాం పంచాయతీకి కొత్తగా మంజూరైన 14 పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని లబ్ధిదారులకు సర్పంచ్ సిందిరి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డంకి రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలకన్నతో పాటు చంద్రయ్య పాల్గొన్నారు. అలాగే బూరగాం గ్రామ సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఇక్కడ 13 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. సర్పంచ్ లోపింటి సంజీవరావు పింఛన్లు అందజేశారు. సచివాలయం కన్వీనర్ జనపాన తిరుమలరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గణపతిరావు, వలంటీర్లు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి:పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ కాల్ల సంజీవరావు

కోటబొమ్మాళి మండలంలో..

కోటబొమ్మాళి: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో ముమ్మరంగా పింఛన్లు పంపిణీ చేపట్టారు. స్థానిక సర్పంచ్ కాల్ల సంజీవరావు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 52 మంది వలంటీర్లు లబ్ధిదారులకు డబ్బులను అందజేశారు. కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, వార్డుసభ్యుడు కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సోంపేట: ప్రజా సంక్షేమమే ప్రభుత్వధ్యేయమని ఎంపీపీ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యుడు తడక యశోద అన్నారు. సోంపేట పట్టణంలో నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను ఎంపీపీ మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. అనంతరం పింఛన్‌దారులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బెండాళం వెంకటరమణ, సర్పంచ్ నగిరి ప్రభావతి, వైస్ ఎంపీపీ రేగు ప్రేమ, ఎంపీటీసీ సభ్యులు పాడుగు కామేష్, బొమ్మిడి ధర్మారావు, ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ, ఈవో వరప్రసాద్, మండల పరిషత్ కార్యాలయ ప్రత్యేక ఆహ్వానితులు లక్ష్మీనారాయణ ఉన్నారు.

అమలపాడులో ఐదుగురికి..

వజ్రపుకొత్తూరు: అమలపాడు పంచాయతీలో ఐదుగురికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. సర్పంచ్ దున్న రత్నంబాలరాజు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే పాతటెక్కలి, లింగాలపాడు, పెద్దబొడ్డపాడు తదితర గ్రామాల్లో కొత్త పింఛన్లను నాయకులు పంపిణీ చేశారు. ఉప్ప సర్పంచ్ కె.గిరిబాబు, డి.ఢిల్లీరావు, వలంటీర్లు ఉన్నారు.

మున్సిపాలిటీలో..

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డులో నలుగురికి కొత్త పింఛన్లను మున్సిపల్ ప్రభుత్వ విప్, కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా పంపిణీ చేశారు. వెల్ఫేర్ సెక్రటరీ రాంప్రసాద్, గృహసారథులు సంధ్యారాణి, బూత్ కన్వీనర్ లక్కోజి నాగరాజు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అండలూరి కోటేశ్వరరావు, కన్నా, సూరజ్ పాల్గొన్నారు.

17వ వార్డులో ఏడుగురికి..

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 17 వార్డులో ఏడుగురికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య లబ్ధిదారులకు అందజేశారు.


ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ పంచాయతీలో అంధురాలు గిన్ని చంద్రమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హేమలత


ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రవి బెహరా


టెక్కలి: బూరగాంలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు


టెక్కలి : శాసనాంలో కొత్త పింఛన్లను అందజేస్తున్న సర్పంచ్ అప్పలస్వామి


సోంపేట: సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్, పింఛనుదారులు


వజ్రపుకొత్తూరు: అమలపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు


కాశీబుగ్గ:పింఛన్లు అందజేస్తున్న విప్ దుర్గాశంకర్ పండా


ఇచ్ఛాపురం: కొత్త పింఛన్‌నుఅందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్ భారతిదివ్య

క్లుప్తంగా

జోరుగా జంగిల్ క్లియరెన్స్ పనులు

కోటబొమ్మాళి: స్థానిక విద్యుత్‌శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ కె.రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం జంగిల్ క్లియరెన్సు పనులు చేపట్టారు.కోటబొమ్మాళి–కొత్తపేట మెయిన్ రోడ్డులోని పలు ప్రదేశాల్లో విద్యుత్‌లైన్స్ తాకుతూ చెట్లుపెరగడంతో వాటికొమ్మలను తొలగించే పనులు చేపట్టారు. సచివాలయ లైన్‌మెన్‌లు సురేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులు సరఫరా

పలాస: రైతులకు కావలసిన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా అధికారులు సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు బొడ్డపాడు ఆర్‌బీకే వద్ద శుక్రవారం యూరియా, డీఏపీ ఎరువులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయకురాలు తెప్పల పావని మాట్లాడుతూ.. బొడ్డపాడు రైతు భరోసా కేంద్రానికి యూరియా, డీఏపీ 200 బస్తాలు చొప్పున వచ్చాయని.. సబ్సిడీపై రైతులకు అందజేశామన్నారు. ఇంకా కావలిసిన వారు ఆధార్ కార్డు, రైతు పాసుపుస్తకం పట్టుకొని వస్తే ఒక యూరియా బస్తా రూ.267, డీఏపీ బస్తా 1349 రూపాయలకు ఇస్తామని చెప్పారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి భాస్కరరావు

సోంపేట: విద్యార్థులు చెడు ప్రవర్తన ఉన్నవారితో అప్రమత్తంగా ఉండాలని, వారికి దూరంగా ఉండడం శ్రేయస్కరమని జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి పి.భాస్కరరావు అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులతో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య ఆవశ్యకత, ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రాము, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీర నాగభూషణం, ఎస్సై హైమావతి, ఏపీడీపీఓ గోవిందరాజులమ్మ, ఉపాధ్యాయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వరిలో పొటాష్ లోపం నివారించుకోండి


వరిపైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వజ్రపుకొత్తూరు: ఖరీఫ్ వరి సాగులో ఎక్కువగా పొటాష్ లోపం కనిపిస్తోందని దానిని నివారించే దిశగా రైతులు దృష్టి సారించాలని రాగోలు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అమరజ్యోతి సూచించారు. బెండి, పెద్దబొడడనాడు, రిట్టపాడు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి వరి పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వరి పైరు పొటాష్ లోపంతో పసుపుగా కనిపిస్తోందని, దీని నివారణకు రెండో దఫా ఎరువులు వేసే సమయంలో ఎకరాకు 20 కిలోల పొటాష్ కచ్చితంగా వేసుకోవాలని రైతుకు సూచించారు. వ్యవసాయాధికారి పి.కిరణ్‌వాణి, ఏఈఓలు ఎం.జ్యోత్స్న, ఉదయ్‌కుమార్, వీఏఏలు దున్న సింధు ఉన్నారు.

అనాథ వృద్ధుల ఇళ్ల వద్దకే భోజనాలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 79 మంది అనాథ వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దకే భోజనాలను లయన్స్ సభ్యులు శుక్రవారం అందించారు. సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ సభ్యులు డాక్టర్ తమ్మినాని పాపినాయుడు భోజన క్యారేజీలను వృద్ధుల ఇంటివద్దకు వెళ్లి అందించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు రోణంకి హేమాచలం, కార్యదర్శి తమ్మినాన మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, హనుమంతు ఎండుదొర, సిందిరి మధుసూదనరావు, కొర్రాయి బాలక్రిష్ణయాదవ్, ఎం.కొండలరావు ఉన్నారు.

వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయండి

టెక్కలి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి శుక్రవారం తెలిపారు. ఇన్‌చార్జి కార్యాలయం నుంచి వైఎస్సార్ జంక్షన్ వరకు పాదయాత్రను పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా అన్న దాన కార్యక్రమం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అన్ని విభాగాల కార్యకర్తలంతా ఉదయం 8.30 గంటలకు చేరుకొని విజయవంతం చేయాలని కోరారు.

ఇచ్ఛాపురం రూరల్: రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని లొద్దపుట్టిలో నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శి రాంపత్ని చిట్టిబాబు తెలిపారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు లొద్దపుట్టిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమానికి పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి కూడలి వద్ద వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయ్‌కుమార్, మండల పార్టీ నాయకులు పుక్కళ్ల గురయ్యనాయుడు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌చార్జిలుహాజరు కావాలని కోరారు.

మొక్కలతోనే మానవ మనుగడ


విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న గ్రీన్‌ఆర్మీ సభ్యులు

ఇచ్ఛాపురం: మొక్కలతోనే మానవుడు మనుగడ సాధ్యమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు అన్నారు. కళాశాల ఆవరణలో గ్రీన్‌ఆర్మీ ప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, మొక్కలు పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రీన్ ఆర్మీ సభ్యుడు, సినీనటుడు అమ్మ రామకృష్ణ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయక్, గ్రీన్ ఆర్మీ అధ్యక్ష, ప్రతినిధులు బోనెల గోపాల్, బి.శ్రీనివాసరావు, రిషికేశ్వరరావు, శివకుమార్, దుర్యోధన దోళాయి, కళాశాల అధ్యాపక సిబ్బంది వరప్రసాద్, బృందావన సంతోష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులంతా బాగా చదవాలి

- డిప్యూటీ ఈవో పగడాలమ్మ

సంతబొమ్మాళి: బోరుభద్ర, వల్లేవలస, వడ్డితాండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను టెక్కలి ఉప విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ శుక్రవారం సందర్శించారు. పదో తరగతి క్లాసులను పరిశీలించి సిలబస్ ఎంతవరకు పూర్తి అయిందో అడిగితెలుసుకున్నారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. తరువాత ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ పెడుతుందని..తదనుగుణంగా మనమంతా మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలని, సమయపాలన పాటిస్తూ సిలబస్ సక్రమంగా పూర్తి చేయాలని అన్నారు. డైరీ లెసన్ ప్లాన్స్, టీచింగ్ నోట్స్ రాసి ఉండాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కామరాజు, రామక్రిష్ణ, భాస్కరరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పగడాలమ్మ

ఆదిత్యలో స్టూడెంట్ క్లబ్ ఏర్పాటు


గూగుల్ డవలపర్ స్టూడెంట్ క్లబ్ విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గూగుల్ డవలపర్ స్టూడెంట్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. గూగుల్ టెక్నాలజీలో అత్యంత ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈ క్లబ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీని ద్వారా అత్యున్నతమైన నైపుణ్యతలను గూగుల్ సంస్థ అందజేస్తుందని పేర్కొన్నారు. ఆ సంస్థ నిర్వహించిన పరీక్షలో కళాశాలకు చెందిన సీఎస్‌ఈ తృతీయ సంవత్సరం విద్యార్థి వి.కృష్ణమూర్తితో పాటు మరో 17 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వెల్లడించారు. వీరంతా గూగుల్ అభివృద్ధికి పాటు పడుతూ ఆయా సంస్థకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేస్తారని పేర్కొన్నారు. అంత కాకుండా ఇతర విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బీఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి ఆర్.శాంతికుమార్, శాక్ ఇన్‌చార్జి జె.సురేష్‌కుమార్, సీఎస్‌ఈ ఫ్యాకల్టీ ప్రతినిధులు డి.ప్రియాంక, పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

సుందరంగా మున్సిపాలిటీ

- చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చుదిద్దుతామని చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. 19వవార్డు సూదికొండలో కౌన్సిలర్ శిష్టు బృందావతి అధ్యక్షతన సీసీ రోడ్డు, కాలువ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి సీదిరి అప్పలరాజు సహకారంతో జంట పట్టణాలను వచ్చే ఎన్నికల నాటికి మరింత ఆకర్షణీయంగా తీర్చుదిద్ది ప్రజల్లోకి వెళ్తామన్నారు. సూదికొండలో వినాయకస్వామి మందిరం నుంచి రెడ్డి భవనం వరకు రూ.4.85 లక్షలతో సీసీరోడ్డు, గజ్జి వల్లయ్య ఇంటి నుంచి వేసిన సీసీ డ్రైన్ రూ.1.07లక్షలు, త్రిమూర్తుల మందిరం వరకు రూ.1.09 లక్షలతో సీసీ రోడ్డు, ఇదే ప్రాంతంలో రెండు డ్రైన్లకు రూ.1.15 లక్షలు.. మొత్తం రూ.9.60 లక్షలతో అభివృద్ధి పనులు చేయడం సంతోషకరమన్నారు. జీడి కార్మికులు అత్యధికంగా నివసించే ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేయడంతో వారంతా ప్రభుత్వానికి అండగా ఉంటారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎం.సురేష్‌బాబు, కౌన్సిలర్లు సనపల సింహాచలం, అంబటి ఆనందరావు, దున్న సత్యం, పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

'ఆడుదాం-ఆంధ్రా'కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మందస: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆడుదాం–ఆంధ్రా టోర్నమెంట్‌కు యువతీ, యువకులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, మండల విద్యాశాఖాధికారులు మద్రిపాటి లక్ష్మణరావు, భాస్కరరావులు కోరారు. మందసలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అక్టోబర్ రెండు నుంచి నవంబర్ ఎనిమిదో తేదీ వరకు సచివాలయం స్థాయి నుంచి మండల, నియోజక, జిల్లా, రాష్ట్రస్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. పంచాయతీరాజ్ విస్తరణాధికారి కె.జయప్రకాశ్, ఎంఎస్‌ఓ ఎస్.రామారావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతం చేద్దాం

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ రెండు తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు అన్నారు. మండలావృద్ధి కార్యాలయ మందిరంలో మండల వ్యాయామోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

కంచిలి: 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో–1 ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

సంక్షిప్తంగా...

9న జాతీయ లోక్‌అదాలత్

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ కోర్టులో ఈ నెల తొమ్మిదో తేదీన జాతీయలోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి చక్రవర్తి వెల్లడించారు. ఈ విషయమై న్యాయవాదులు, పోలీసు అధికారులతో శుక్రవారం సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు చక్కని అవకాశమని..ఈ విషయమై కక్షిదారుల్లో అవగాహన కల్పించాలన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తాము చేస్తున్న సేవలతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని హెచ్‌ఎంలు శివరాంప్రసాద్‌పాఢి, ఎస్.విశ్వనాథం అన్నారు. రాజపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పని చేసి వేరే పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో తమ అనుభవాల్ని బదిలీ ఉపాధ్యాయులు పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు జమ

వజ్రపుకొత్తూరు: పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు జమయ్యావని టెక్కలి డీఎల్‌పీఓ ఐ.వెంకటరమణ తెలిపారు. పూండి గ్రామంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల పీఎఫ్‌ఎంఎస్ ఖాతాలకు జనాభా ప్రాతిపదికన నిధులు జమైనట్టు పేర్కొన్నారు. ఈ నిధులను పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఉమ్మడిగా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ముందుగా పంచాయతీ కార్యదర్శులు ఈ– గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో వెండర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

డిగ్రీలో ప్రవేశానికి ఐదో తేదీ వరకూ అవకాశం

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఐదో తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు గడువు పెంచినట్టు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలను కలిపే కేటీ రోడ్డు విస్తరణలో భాగంగా నూతన విద్యుత్ లైన్ వేస్తున్నందున శనివారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఏఈ ఎం.మురళి ఓ ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ పరిధిలో ఉన్న కేటీరోడ్డు, చేపల మార్కెట్, సూదికొండ, శివాజీనగర్, సాయికాలనీ, వివేకానందకాలనీ, పలాస పరిధిలోని ఉదయపురం, పురుషోత్తపురం ప్రాంతాలకు సరఫరా ఉండదని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

టెక్కలి: విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌పై తప్పనిసరిగా అవగాహన ఉండాలని టెక్కలి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు సూచించారు. టెక్కలి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులంతా స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండి సామాజిక స్పృహతో ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, సీనియర్ న్యాయవాదులు డి.రాజేశ్వరరావు, ఎంఈవో డి.తులసీరెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శోభారాణి, నాగభూషణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వజ్రపుకొత్తూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని.. ఇందుకు ప్రతీ గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా సమన్వయంగా పని చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు అన్నారు. దేవులన్నాడ, కొత్తపేట, కొమరల్తాడ గ్రామాల్లో జేసీఎస్ టీఎం, ముఖ్య నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మంత్రి సీదిరి అప్పలరాజు వజ్రపుకొత్తూరు మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సీదిరి అప్పలరాజును మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి కరుణాకర్ పాల్గొన్నారు.